
# వెలుగుదారి వెతుకుదారి



గోదారమ్మకు చివరకు కొడుకుతో బయలుదేరక తప్పింది కాదు.

ఊర్లో అమ్మలక్కలూ, ఇరుగూ పొరుగూ అంతా కేశవుడికే వంత పలికారు. గోదారమ్మ చెప్పాలనుకున్నది అర్థమయిందో లేదో కాని.. '' ఒక్కదానవూ ఇక్కడేనికి... ఆయొచ్చినా పైయొచ్చినా- ఎవరు సూస్తారని... మేమున్నాం గానీ. ఏదయిన ఈ ముసలితనంలో కొడుకు కాడ కెళ్లిపోడమే మంచిది. మనవలతో ఊసుపోతాది. కొడుకు రానన్నాళ్ళూ రాలేదని ఏడ్చేదానివి. తీరా వస్తే ఆడితో ఎళ్ళనంటున్నావు. కోడలి పిల్ల మంచిదాయే కదా. సక్కన సూసుకుంతాది... వెళ్ళు... వెళ్ళు...' అంటూ చీర మార్చేసి వూరు బయల్దేరడానికి సిద్ధం చేసేసారు.

'' ఒకపూట తినీ... మరోపూట తినక మా గురించే ఆలోచిస్తూ అనారోగ్యంపాలు అవడమెందుకు... మాతోనే వుండు... మనుమలు కూడా నాయనమ్మను చూడాలంటున్నారు...'' కొడుకు కేశవుడి మాటలు.

గోదారమ్మకూ మనవల్ని చూడాలనీ, ముద్దులుతో తడిసి పోవాలని... ముసలి శరీరానికి ఉబలాటంగానే వుంది.. కొడుకూ కోడలూ కళ్ళముందు చిలకా గోరికంల్లా కాపురమంటుంటే రేపోమాపో చావాల్సిన దానికి అంతకు మించి ఆనందమేముంటుంది?

అది కాదు గోదారమ్మకు అడ్డు కట్టలేసింది.

గోదారమ్మ పుట్టింది... పెరిగింది.. పెళ్ళాడింది... పిల్లల్ని కన్నదీ ఆ పల్లెటూర్లోనే. పట్నాల్లో... దేశంలో ఎక్కడెక్కడో శాఖోపశాఖల్లా తన కుటుంబం విస్తిరించి వుండొచ్చుగాక...!... కాని ఆవూరు విడిచి పెట్టింది ఏనాడు లేదు. యాభై ఏళ్ళ కాపురమూ గడుపు కొచ్చింది అక్కడే... కట్టుకున్న పెనిమిటిని బుగ్గి చేసిందీ అక్కడే...

అందుకే తనూ ఆ మట్టి మీదే ఇంకిపోవాలనుకుంటోంది.

కాని ఇవేవీ చెప్పడం గోదారమ్మకు చేతకాదు.

అందుకే ఏది మాట్లాడాలో తెలియక... ''మనమెళ్ళిపోతే... ఈ ఇంతడు ఇంట్లో... ఇన్నాళ్ళూ దీపమెలిగిన ఇంట్లో... ఇక దీపముండదు.. ఈ ఇల్లు సాసేనం అయిపోతాది. ఇంటికి తాళాలు పడిపోతాయి....'' దాదాపు ఏడ్చేసింది గోదారమ్మ.

''...నువ్వు లేపోతే... దీపమేనికుండదే... మనపల్లెటూర్లోన అద్దులు రాకపోయినా ఎవులు కుండమన్న ఇల్లు శుబ్రం సేసుకొని వుండకపోరు...'' సముదాయించిందొక మిత్తరాలు.

అసలు గోదారమ్మ కొడుక్కి ఇల్లు అమ్మేయాలనే వుంది. కాని తాతముత్తాతల ఆస్తి... ఆల జ్ఞాపకమని అమ్మటానికి ససేమిరా అంగీకరించలేదు గోదారమ్మ.

కేశవుడు తన ప్రయత్నాన్ని విరమించుకోక తప్పింది కాదు.

గోదారమ్మ కొడుకు వెంట బయలుదేరిందే కాని... అడుగులు ముందుకు పడుతున్నా... హృదయం వెనక్కి లాగుతూనే వుంది.. ఊరికోనేరు గుడిగోపురం, పావురాలు, పాలపిట్టలు, కోకిళ్ళు, కాకులూ... గేదెలు.. ఆలమందలూ.. మేకలూ గొర్రెలు... అన్నిటినీ వదిలి పోవడం కష్టంగానే వుంది.

అమ్మోరికి చేతులెత్తి మొక్కింది.

'' ఇన్నాళ్ళూ నీ సలవలోనే వున్నాను. కాని ఈవేళ ఇలాగ...'' చెప్పలేని భావాన్ని ఛేదిస్తూ కొడుకు పిలుపుతో అయిష్టంగానే అమ్మోరి ముందు నుంచి కదిలింది.

వచ్చీ పోయేవాళ్ళు పలకరిస్తున్నారు.

''మళ్ళొస్తావా... అక్కడే వుండిపోతారేటే...'' అంటూ అందరిదీ ఒకటే ప్రశ్న. 'అప్ప, సెల్లి, అత్త, పిన్ని, కోడలు, ఈరకత్తె, అమ్మమ్మ, నానమ్మ...'' అందరూ ఏదో సంబంధమున్నట్లు సంబోధనలే... నిజమే! ఊరంతా కుటుంబ మయిపోయింది. ఊరు చిన్నదయినా... ఒకే పేగు కాకపోయినా... ఒకే రక్తంగా వున్నోళ్ళ నందరినీ వదిలి వెళ్లడం చేత కావడం లేదు. అచేతనంగానే కొడుకు వెంట వెళ్ళి బస్సు ఎక్కింది. వెంట వచ్చిన చాలా మంది బస్సు కదిలేదాక అలానే నిల్చుండిపోయారు. కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.

కళ్లు కలకలయినట్టు-కళ్ళు మర్రి దుబ్బల్లా అయి ఎఱుపుతో వాచిపోయి బరువెక్కాయి.

బస్సులో చాలాసేపు ప్రయాణించి దిగి అరాత్రికే మరో రైలు ఎక్కారు. పయనమయింది మొదలు కొడుకుతో ఒక్కమాట కాదు కదా పెదవయినా విప్పలేదు గోదారమ్మ.

కొడుకు ఒకటిరెండుసార్లు మాట్లాడాలని ప్రయత్నించి ఏమనుకున్నాడో ఊరుకున్నాడు.

అప్పటికి సమయం రాత్రి పదిగంటలవొచ్చు.

''అమ్మా... అమ్మా... భోజనం చెయ్యి...'' అంటూ కేరియర్ విప్పి ఓ కప్పుతో తల్లికి అందించాడు కేశవ. పట్టుకుందే కాని ఒక్కమెతుకూ ముట్టలేదు... అప్పటికే కొడుకు తినేసి చెయ్యి కడుగుకొని వచ్చి ''తిను... ఆ..'' మరోసారి కదిపాడు.

''తినబుద్దేయడం లేదురా...'' కప్పుతో భోజనాన్ని పక్కకు తోసేసింది గోదారి. కేశవుడు తినమని ఒత్తిడి చేశాడు. కాని ఫలితం లేకపోయింది.

కాలంతో పోటీ పడలేని రైలు పరుగెత్తలేక అలసిపోయి స్టేషను స్టేషనుకూ ఆగుతోంది.

అర్ధరాత్రి అవడంతో ఇంచుమించు అందరూ నిద్దట్లోకి జారుకున్నారు. కొడుకు కేశవుడు కూడా. కొడుకు తలని తీసుకొని ఒడిలో నిడుకుంది. కొడుకు ముఖంలో గోదారికి కట్టుకున్నోడు కనిపించేడు. కాలగతిలో నలిగిపోయిన జ్ఞాపకాలు మనసుని తీపిగా కుళ్ళబొడిచేస్తున్నాయి.

మనసు ఏదేదో ఆలోచిస్తోంది....

ఒక్క క్షణం వీడలేని మగడు... శాశ్వతంగా దూరమయినప్పుడు శోకించింది. కాని వెంట వెళ్ళలేక పోయింది.

రేపు తనూ పోతుంది.

ఏడుస్తారు!

కన్నీళ్ళు జారవిడుస్తారు!

జ్ఞాపకాలు మిగిలిపోతాయి. మట్టిలో కలిసేదాక అవి వెంట బడతాయి. మనిషి మాత్రం వాటి నుండి దూరంగా పారిపోలేడు. అలా పారిపోతే... ఆ జ్ఞాపకాలే లేకపోతే జీవితమే విషమయిపోతుందేమో!?

గోదారమ్మ కిటికీలో నుంచి బయటకు చూస్తోంది.

చీకటి... గాడాంధకారమయిన చీకటి... వెలుగు అక్కడక్కడా... అదే జీవితమేమో... దారిపొడుగును చీల్చుకుంటూ రైలు రొద...

భూమి విశాలమైందనిపించింది.

దీని మీద ఎంతమంది ప్రజ జీవిస్తున్నారో...!?

వాళ్ళ మధ్య బంధాలు... బాంధవ్యాలు ఎంతగా పెనవేసు కున్నాయో... పేగుతో చుట్టబెట్టుకున్న రక్తసంబంధాలు... మరెన్నెన్ని అనుబంధాలు.. అప్యాయతలు... ప్రేమలూ..

వీటన్నిటినీ వదిలి ఎప్పుడో ఒకప్పుడు మనిషి మరణిస్తాడు.. ప్రాణం గుట్టుక్కుమంటుంది.

చాలా సున్నితంగా బంధాలను త్రెంచుకొని ప్రాణం ఎలా వెళ్ళిపోతుందో...!? ప్రశ్నించుకుంది గోదారి.

తెలతెల వారుతుండగా తెలివొచ్చింది కేశవుడికి

''అ... అమ్మా..... పడుకోలేదా... '' ఆత్రంగా అడిగాడు కొడుకు.

''పడుకున్నాన్లే...'' అన్న గోదారి మాట అబద్ధమని ఆ తల్లీ కొడుకులిద్దరికీ తెలుసు..

ఇంతలో దిగాల్సిన స్టేషనులో బండి ఆగడంతో గబగబా సామాన్లు అన్నీ పట్టుకొని తల్లికి ఊతమిస్తూ రైలు దిగాడు కేశవుడు. అక్కడ నుండి ఆటోలో ఇల్లు చేరేసరికి తెల్లవారింది.

''నాయునమ్మా...నాయునమ్మా....'' అంటూ మనుమలు గోదారమ్మని చుట్టుముట్టేసారు. వారి సందడికి. ....సరదాకీ... మనసులోని మసక కొన్ని క్షణాల్లోనే కొట్టుకుపోయి ఉత్సాహంతో వుక్కిరి బిక్కిరయిపోయింది. కోడలు 'అత్తయ్యా...' అంటూ అప్యాయంగా దగ్గరకొచ్చి కాళ్ళ దగ్గర కూర్చుండిపోయింది.

పిల్లల ప్రశ్నలకు ఊరునుండి ఏరుదాక మొత్తం చెప్పుకొచ్చింది గోదారమ్మ. కోడలు ఆరోగ్యమెలా వుందని అడిగితే.. ''నా మాటకేమమ్మ రేపో-మాపో పోవలసిన దాన్ని... ఆపరేషను గట్రా సేయించుకున్నావు గదా, నీవు జాకర్తగా వుండాల. గట్టి పనులు సేయకూడదు. అంతాక్కాపోతే కేశవుడికి సెప్పు.... ఇంటి పనికి తప్పేటుంటాది....? మీ మామ నన్ను నీలు కూడా మొయ్యినిచ్చోడు కాదు. తనే కావిడేసోడు...'' చెప్పుకుపోతున్న తల్లిని చూస్తూ కేశవ కొంత కుదుటపడ్డాడు.

కోడలు స్నానానికి వేడినీళ్ళు పెడితే గోదారమ్మ గబగబా రెండునీళ్ళు పోసుకొని వంటలో సాయపడబోయింది. కాని కోడలు వద్దనడంతో ఆడపిల్లకి జడలు వేస్తో- మిగతా మొగరాయిళ్ళ మనుమలిద్దరూ అది చూసి పక్కున నవ్వారు. కొడుకూ కోడలూ నవ్వడంతో అర్థంకాని గోదారి ''నేనో పల్లెటూరి బైతుని... మీ నాయనైతే పట్నపోడు...'' మనసు ఏమూలో చివుక్కుమనడంతో అనేసింది.

ఇంకా ఆగని నవ్వులకు మరింత ముసలి మనసు కుచించుకుపోయి ''మీ నాయన్నా

కొడుకేని ముందు... ఆ తరువాతే మీ అయ్య... పట్నపోడు...'' అంది.

''స్కూల్‌కు టైమవుతోందర్రా...'' కేశవుడు పిల్లలకి గుర్తు చేశాడు.

నెమ్మదిగా కూడబలుక్కొని మనుమలు ముగ్గురూ గోదారితో-

''నాయనమ్మా ఈవేళ నువ్వొచ్చావు కదా, నీతో సరదాగా ఈరోజు వుండి పోతామే... బడికెళ్ళం... నాన్నకు చెప్పు...'' అన్నారు.

'' ఎందుకు వెళ్ళర్రా... నాన్నమ్మ ఇక్కడే వుంటుంది ఇకనుండి. మీరు ముందు బయలు దేరండి....'' కాస్తంత గట్టిగానే అరిచాడు కేశవుడు.

'' ఏనికిరా కేశవా ఆకేకలు... పూట బడి మానేస్తే బతుకులాగిపోవు...'' ఆప్యాయంగా పిల్లల్ని నిమురుతూ అంది గోదారి.

''... అది కాదత్తయ్యా... ఈరోజు వెళ్లకపోతే స్కూల్లో నోట్సులు పాఠాలు అయిపోతాయి. వీళ్ళు వెనుకబడిపోతారు... అందుకేవెళ్ళనీ... వెళ్ళండ్రా... వెళ్ళమ్మా...''

కోడలు పిల్లలకి బేగులిచ్చి పంపించింది. చిన్నదయితే వెళ్లేటప్పుడు ఏడుస్తూనే వుంది.

గోదారమ్మ గొణుక్కోవడం వినకుండానే డ్యూటీకి టైమైందని కేశవ కంపెనీకివెళ్ళిపోయాడు.

కోడలు వంటగదిలో పడిపోయింది.

''... అయినా... పుట్టిబుద్దెరిగి సూసినాను... ఊర్లంతా పిల్లలు సదువుకోడానికి ఎళ్తానంటే..... ఊళ్లేదు... కోతకి రారా... మరి మోతకి రారా... అయ్యకీ పనోళ్లకి తిండిచ్చీసి రారా... కళ్ళంలో కాపుండరా...ధాన్యం మిల్లాడించారా.. అంటూ పనులు పురమాయిస్తే...బడిలోకెళ్తామని బలపాలు పట్టుకు ఏడ్చేవోరు... ఒక్కరోజెళ్ళమంటే వూరికి గండయిపోతున్నారు.. సదువులు మరెవరికెరిక లేదు...'' స్వగతంగానే దీర్ఘం తీసుకుంది ఒంటరిగా కూర్చొని.

కాసేపు అయాక కూర్చోబుద్దెయ్యక ఇంటిలో నుండి వరండా దాటి బయటకు వచ్చింది. ఇరుగు పొరుగు వాళ్ళు ఇళ్ళలో నుండి పైకి రావడం లేదు. వచ్చిన్నుండి అదే గమనిస్తోంది గోదారి. ' ఇవేమి ఇళ్ళా, జైళ్లా...' పైకే అనేసుకుంది.

అదే సమయంలో అటుకేసి వయసుమళ్ళిన ఇద్దరాడవాళ్లు పోతూ గోదారి కేసి చూసేసరికి... చూపు చూపు క్షణకాలం కలుసుకోగానే... అలవాటుగా ... అనవాయితీగా పలకరింపుగా నవ్వింది గోదారి.

ఆ ఇద్దరాడవాళ్ళు గోదారి దగ్గరగా రావడం చూసి ' ఏమమ్మా' అంది. ''క్యా..

బోల్తా.. ఎందుకలాగ నవ్వుతావ్..., పల్లిగలిస్తావ్?..'' వచ్చిన ఇద్దరూ అరుస్తూ మీదపడినంత పనిచేశారు. గోదారికి మొదటర్థం కాలేదు. తర్వాత వాళ్లు అపార్థం చేసుకున్నారని అర్థమయింది.

ఇంతలో కోడలు వచ్చి విషయం తెలుసుకొని సర్ది పంపించేసింది వాళ్ళని.

గోదారే అడిగింది.

''పిల్లా... నానేట న్నానని... పలకరింపులే తప్పయిపోనాయా....మనూరుల్లంట ఎంతిదీ... తెలియనోళ్ళు ...మొగమెరగనోళ్ళొచ్చినా... ఏమినాయనా ఎప్పుడొచ్చావు.. బాగున్నావా...' అని పలకరిస్తాము. ఇదేం మనుషులు...''

'' ఇక్కడి మనుషులింతే... తెలిసిన వారితోనే మాట్లాడరు... తెలియని వారితోనా ఇంకా ... ఎ...'' అంటూ ఇంట్లోకి వెళ్లి పనిలో పడింది కోడలు.

గోదారమ్మకు లోకం విచిత్రంగా కనపడింది.

వంటయినాక మధ్యాహ్నం భోజనం చేసింది గోదారి. 'పిల్లలకు కేరీజు కట్టేసాను... వాళ్ళు అక్కడే తింటార'ని చెప్పింది కోడలు. కొడుకు అక్కడే క్యాంటీన్‌లోనే తినేస్తాడట.

గోదారి కోడలుతో మాటామంతీ ఆడుతూనే వుంది. ఈలోగా కోడలు పిల్ల భోజనం చేసి... చదవడానికి పుస్తకం తీయడంతో ఆగిపోయింది. కాస్సేపు చదివి కోడలయితే పడుకుంది గానీ గోదారికి మధ్యాహ్నం పడుకోవడం అలవాటు లేదు. తినేసి అరుగుల మీద అమ్మలక్కలంతా జేరి ఊరూసులు కష్టసుఖాలు మాట్లాడుకుండీవోళ్లు.

ఒక్కరోజుక భరించలేకపోయింది గోదారి.

అదే విషయం కోడలుతో అంటే...'' ఆ... పోనీలే మన రెండిళ్ళ అవతల మన తెలుగోళ్ళ బామ్మే వుంది... నీలానే వూసులాడే వాళ్ళు కావలనేది. రేపు పరిచయం చేస్తాలే'' అందామె. కోడలి మాటలు కొంత సంతోషాన్ని కలిగించాయి.

ఆరోజు రాత్రి గోదారమ్మ పక్కనే మనుమలు చేరి కథలు చెప్పమని కచ్చాపెట్టేసి మరీ పడుకుండిపోయారు. కొడుకూ కోడలూ కూడా వేరే గదిలో పడుకుండిపోయారు. అర్థరాత్రి అవుతున్నా కన్రెప్పలు మూసుకున్నా నిద్రరావడం లేదు.

ఊరు గుర్తొచ్చింది. ఎప్పుడూ ఎత్తిపొడిసే అంకమ్మ ఆవేళప్పుడు గుర్తుకు రావడంతో తిట్టుకుంది.

తరువాత ఊరిచుట్టూ... ఆ వూరి మనుషులు చుట్టూ మనసు తిరిగి తిరిగి వేకువ రాకముందే నిద్రపట్టేసింది గోదారికి.

పిల్లలు తెల్లారగట్ల లేచి చదువుతుంటే మెలుకువ వచ్చి తనూ లేచిపోయింది. కోడలయితే పడుకోమంది కాని వినలేదు. కోడలు పిల్లల్ని చదివిస్తుంటే తను వెళ్ళి వీధి

అరుగు కడిగి గడప తుడుస్తుంటే కోడలు వద్దని వారించింది.

పట్టువదల్లేదు గోదారి. తుడవడం పూర్తయ్యాక ''కళ్ళాపు చల్లడానికి పేడ'' ఏదమ్మా అడిగింది.

''పేడ ఇక్కడ దొరకదు...''

''పేడ దొరక్కపోతే కళ్ళాపెలాగ ఏస్తారే....'' ప్రశ్నించింది అనుమానంగా గోదారి.

''కళ్ళాపులు వెయ్యరు...''

''... ఏటి కళ్ళాపులు ఎయ్యరా...'' ఆశ్చర్యంగా నొసలు చిట్లించింది.

అప్పుడే లేచిన కేశవ బ్రష్ మీద పేస్టు పెట్టుకొని వస్తూ విషయం విని నవ్వి ''... అమ్మా... నీ చాదస్తం గాని ఇది సిటీ.. పట్నం... '' అన్నాడు.

''కళ్ళాపేసి ముగ్గులెయ్యడం చాదస్తమా... ఇంటి కెంతందమూ ... ఈగలూ దోమలు గట్రారావు...'' అంటూనే వత్తినీళ్ళు వత్తుగా పోసి 'కళ్ళాపు జల్లాను'' అనుకుంది గోదారి. ముగ్గుపిండడిగితే లేదంది కోడలు.

''భలేగున్నాది గాని.... నువ్వు గాని ముగ్గులెయ్యడం మరిసిపోనావేటి? పోని ఆ వరిపిండియినాతే...'' గోదారి మాటల్తో కోడలు వరిపిండి గిన్నెలో వేసి ఇచ్చింది.

ముగ్గేస్తూనే గోదారి ఆలోచిస్తోంది.... 'మనుషులు తెల్లమిగిలిపోయినారు గాని అసలు వరి పిండితోనే మొదట ముగ్గులు వేసేవోరు. బియ్యం రేట్లెక్కువయిపోయి రాయి పిండేసి జీవుల నోట్ల మట్టిగొడుతున్నారు. అసలు వరిపిండితో ముగ్గులేస్తే కోళ్లో.. కుక్కలో తింటాయనాట. అలాగే ఇంట్లో ధాన్యపు ఎన్నులు ఏందుకు గుత్తులుగా కడతారు? పిచ్చుకలు...చిలుకలు ఎరుకుంతాయని. వాటి కాహారమెట్టడమని మాట. పెద్దోళ్ళయితే కళ్ళాల కెళ్ళి నూకలు జల్లేవోరు... అదంతా ఏనికి. వంట చేస్తే తొలికుండ ముద్దన్నం, కూర అంత పొయ్యి చుట్టూరా తిప్పి... అగ్గిదేవుడుకని అవతలకిసిరేస్తే చీమలూ, కాకులూ... అన్నీ-ఏరుకొనేవి... అలాగే మడపళ్లెట్టడం...' అన్నీ భూమ్మీద జీవుల్లోకెల్లా ఉత్కృష్టమయిన జీవి మానవుడు. ఆహారం పెట్టి ఆదుకోడం...

నేడేది...?

ఆ ఇళ్ళు ఏవి..???

ఆమనుషులేరి...????

ఆజీవులేమయిపోయాయి...??

మనుమరాలి పిలుపుతో ఈ లోకానికి వచ్చింది గోదారి.

''ముగ్గులు నేర్పించవా నాయనమ్మా....'' మనుమరాలు అడిగింది.

''సంతోషం తల్లీ నీకయినా నేర్చుకోవాలని ముచ్చట పుట్టింది. నేర్పుతాన్లే...''

అని పైకి అందే కాని...'' నేర్చుకోని ఏటి సుఖవమ్మా.. ఈ పట్నంలో ఏ ఇంటి ముందు ముగ్గున్నాదనీ, పుస్తకాల్లోన... పలకల్లోన ఏసుకొని మురిసిపోడానిగ్గానీ... ఏలా?...'' అనిపైకి అనలేకపోయింది.

చిట్టి చేతుల్తో మనుమరాలు పిండి వలక బోస్తుంటే 'అలా కాదిలా అని'... ఎలావేయాలో వేసి చూపించింది.

ఇంటి ముందు ఇరవైనాలుగు చుక్కల ముగ్గంటూ చాలా పెద్ద ముగ్గేవేసింది. ఆముగ్గు చూడ్డానికని ఈలోగా సూర్యుడొచ్చేసాడు.

కాంపౌండులో ఏ మూల దొరికిందో గోదారి కళ్ళకు తులసి మొక్క... దాన్ని తీసుకొచ్చి పెరడులో పాతిపెట్టింది. తులసి వల్ల వుపయోగాల్ని వల్లెవేసింది.

కొడుకూ కోడలూ చిన్నపిల్లల్లానే విన్నారు.

గోదారి పూజలు... పునస్కారాలు పూర్తయ్యేసరికి గంటపట్టింది. కొడుకూ కోడలూ తమ పనుల్లో పడిపోయారు.

ఇంతలో చిన్న మనుమరాలు బుడి బుడి అడుగులతో వచ్చి ''అమ్మా.. ఎవరో.. మనింటికంట... ఒచ్చారు..'' అంది తల్లి కొంగు గుంజిలాగుతూ. ఆ మాట వింటూనే కోడలు పిల్ల పరుగులాంటి నడకతో వెళ్ళింది. వెనకాలే కేశవ. మిగిలిన పిల్లలు. ఇంటి ముందు జనం.. ఆరా తీస్తే... ముగ్గు చూస్తూ నిలబడ్డారని తెలిసింది.

కేశవ అదోరకంగా భార్య వంక చూశాడు. ఆమె చిన్నగా నవ్వింది.

''ముగ్గుసూడ్డాకా...''' గర్వంగా అంది గోదారి.

''... అయితే అమ్మా.... నాన్నమ్మ ముగ్గు ఎగ్జిబిషనులో వేయించాలి...'' అన్నాడొక మనుమడు.

'' ఇంత పెద్ద ముగ్గేసి గిన్నీసు బుక్ ఎవరెక్కారు?... ఇప్పుడు నాన్నమ్మ ఎక్కుతుంది. '' మరొక మనమడు.

మనుమలంటున్నవి పూర్తిగా అర్థం కాకపోయినా ఉప్పొంగిపోయింది గోదారి.

''అంతిదిగా సూడకపోతే ఇళ్లముందు ముగ్గెట్టుకోరాదా'' తనలో అనుకుంటూనే పైకి అనేసింది గోదారి.

ఆరోజు పిల్లలు, కేశవ వెళ్ళిపోయాక కోడలు ఇంటికి రెండు తాళాలు వేసింది గోదారమ్మకు మరో బామ్మతో పరిచయానికి తీసుకువెళ్దామని.

''తాళ మెయ్యడమేనికి ఏదో ఊరెళ్లుతున్నట్టు... ఈవీధిలోనే కాదా..'' అనుమానంగా కోడల్ని అడిగింది గోదారి.

''.... అత్తయ్యా.. ఇది మన ఊరు కాదు.. పట్టపగలు పది తాళాలు వేసినా

పగులగొట్టుకొని మరీ దోచుకుపోతారు. అందుకే ఇంట్లో వున్నా చాలా మంది లోపలి నుండి తాళం వేసుకుంటారు...'' కోడలి మాటలు గోదారికి విడ్డూరంగా, వింతగా తోచాయి. తమ ఊరు ఏనుగంత ఎత్తులో వుంటే ఈ పట్నం ఈగంత చిన్నదిగా కనపించింది.

గోదారి కోడలి వెంట నడుస్తూ పరిచయం చేస్తానని చెప్పిన ఇల్లు చేరుకుంది.

కోడలు కాలింగ్ బెల్లు నొక్కగానే ఆ ఇంట్లో నుండి ఓ పదేళ్ళ పిల్లాడు వచ్చి లోపలి నుండి వేసి వున్న తాళం తీయడం చూసిన గోదారికి పరిస్థితి చాలామటుకు అర్ధమైంది. ఆమెకు ఇళ్ళు జైళ్లు అనిపించాయి.

ఆ ఇంటావిడ రావడంతో వదినా మా అత్తయ్యగారు. ఈవిడకు మన వాతావరణం.. అన్నీ... పల్లెటూరి నుండి రావడంతో - కొత్తగా వున్నాయి. కష్టసుఖాలు మాట్లాడేమనుష్యుల్లేరని... ఇదవుతుంటే మీ అమ్మగారున్నారని... ఇద్దరు ముసలాళ్ళకి ఊసుపోతుందని...'' విషయమంతా చెప్పింది కోడలు.

గోదారికి నమస్కారం చేసి ' ఉండండి టీ తెస్తాను...' అంటూ వెళ్ళి క్షణాల్లో టీ తీసుకొచ్చి ఇచ్చిందా ఇంటావిడ.

వద్దంటూనే తాగక తప్పలేదు అత్తా కోడళ్ళు.

'' ఎవరమ్మా.... ఎవరు...'' కళ్ళకు చేయి అడ్డం పెడుతూ అంది అప్పుడే ఇంట్లో నుండి వచ్చిన ఓ ముసలావిడ. ఆమెకు చూపు సరిగా ఆననట్టుగా వుంది.

గోదారి గురించి ఆ ముసలావిడితో చెప్పి ''అత్తయ్యా వస్తాను... వస్తానండి ఇంట్లో పనులున్నాయి...'' అంటూ కోడలు వెళ్ళిపోయింది. ఆ ఇంటావిడ పెరడులోకి వెళ్ళిపోతే ఆ ముసలాళ్ళిద్దరూ ఆ అరుగుమీదనే కూర్చుండిపోయారు.

అంతకంటే మాటల్లో పడిపోయారు.

మాటలకు దొరకడంతో ఇద్దరికీ ఎక్కడలేని సత్తువా వచ్చేసినట్టుంది. దాంతో పుట్టు పూర్వోత్తరాల నుండి పెళ్ళి పెటాకులు.. సంసారాలు కబుర్లు దాటుకుంటూ చావు వరకూ వెళ్ళారు. ఇద్దరూ కలసి ఎన్నో జ్ఞాపకాలను తవ్వుకున్నారు. వాళ్ళ కనురెప్పలు తడిచిపోయాయి. గుండెలు భారమై... చెప్పుకున్నాక తేలికై హృదయాలు కుదుటపడ్డాయి.

''మనద్దిరమిక మిత్తనోరుం'' - అంటూ నేస్తరికాలు కూడా కట్టుకున్నారు.

కేశవుడొచ్చి పిలచి ఇంటికి తీసుకెళ్ళేదాక చీకటి పడ్డట్టు గోదారికి తెలియరాలేదు.

ఇప్పుడు గోదారికి ఆనందంగానూ తృప్తిగాను వుంది.

మనుమల్ని ముద్దులాడింది. గోరుముద్దలు తినిపించింది. అలా తినిపిస్తుంటే

గోదారికి తన ఊరు గుర్తుకొచ్చింది. పెరట్లోని లచ్చడి కొడుకు సొంటిడు.. సీతాలు కూతురు సిన్నమ్మి.. కళ్ళముందు మెదిలారు. తనతో తిండికి కూర్చొని పోటీ పడి తినిపిస్తేనే తినేవారు. ఎంతో ముద్దొచ్చేవారు. కూరే వుండాలని లేదు పిండొడిమిచ్చినా, అప్పడం కాల్చిచ్చినా గులాములు అల్లరి సేసోరు కాదు. ఆ గుంటలు ఏటి సేస్తున్నారో... మతిలేసుకొనే వుండుంటారు' అనుకుంది.

రాత్రి పడుకుంటూండగా తెల్లవారి లేచిన దగ్గర్నుండి జరిగినదంతా కళ్ళ ముందు మరోసారి కదిలింది గోదారికి.

ఆలోచిస్తున్న మనసును అచేతనం చేస్తూ అలసిన కనులు మూసుకుపోయాయి.

ఊర్లోకి వరద నీరొచ్చేసింది... ఏర్లూ వాగులూ గట్లు తెగి ఊరు చెరువయ్యింది... పిల్లా పిచ్చుక అంతా పరిగెడుతున్నారు. అన్నీ వదిలి కుటుంబ సమేతంగా కొండమీది కెళ్ళిపోయారు. గోదారవ్వ నడవలేక నడుస్తోంది. ఒక్కర్తీ.. ఒంటిగా వెనకబడిపోయింది.... చచ్చినా బ్రతికినా ఈ మట్టి మీదే.. అరెరే నా ఇల్లూ కూలిపోతోంది... ''అవొమ్మ'' అరచిలేచి కూర్చుండిపోయింది గోదారి. నిద్ర వదిలేసినట్లుంది. వళ్ళంతా చెమట పట్టింది.

కొడుకూ కోడలూ లేచిపోయి వచ్చి మంచి నీళ్ళు తాగబెట్టి 'పీడకలా' అడిగారు. '' ఏమిలేదర్రా...'' అనేసింది. కాని ఊరేమయిందో మనసుకు బెంగగా అనిపించింది. ఊరి మీద ప్రేమ... అభిమానం... మరింతెక్కువయ్యాయి. ఒక్కసారి వెళ్ళి ఊర్లో వాలిపోవాలనిపించింది. ఊరిని... ఇంటిని... అందర్నీ జాలిగా అక్కున జేర్చుకొని తడిమెయ్యాలనిపించింది.

చాలా సేపటి వరకు నిద్ర పట్టలేదు గోదారికి.

తెల్లవారిలేస్తూనే ముంగిట ముగ్గులూ అన్నీ చూసి, తనతో తెచ్చుకున్న కుంకుడు కాయలు చితక్కొట్టి నీట్లో నానబెట్టింది. శనివారం అన్చెప్పి, వద్దన్నా కుంకుడు కాయితోనే మనుమలకి తలంటి పోసింది. పైగా నలుగు బెట్టింది. స్నానాలయినాక పవిట చెంగుతో తుడిచి సాంబ్రాణి గుగ్గిలం పొగ తలకీ వంటికీ పట్టించింది.

చిన్నది కుంకుడుకాయ కళ్ళలో పడిందని 'మంట' అంటూ ఎఱ్ఱని కళ్ళతో ఏడ్చేసరికి చాలా బాధపడిపోయింది. గోదారి తనని తానే తిట్టుకోవడం మరింత జాలనిపించి ఊరుకున్నారా మనుమలు.

గోదారి ఇంట్లో తనకోసం చేసి పెట్టిన బూర్లెను చెంగు చాటున పెట్టుకొని ముసలి నేస్తానికి అందించి వచ్చింది.

ఆరోజు సాయంత్రం కేశవ అందర్నీ సినిమాకి ప్రయాణం కమ్మన్నాడు. గోదారి

రానంది. కాని పిల్లలు ఒప్పుకోకపోవడంతో బయలుదేరింది.

రోడ్డు మీద ఆటో వెళ్తూ వుంటే, ఆటోలో కూర్చున్నా గోదారికి కారులో కూర్చునంత సంబరంగా వుంది. మేడలు... మిద్దెలు.. ఫ్యాక్టరీలు.. ఎన్నెన్నో వాహనాలు. ఇసుక పోస్తే రాలనంత జనం... అన్నీ చూస్తుంటే ఏదోగా వుంది. వింతగా అనిపించింది. దేశం ఎక్కడికో వెళ్లిపోతున్నట్లుగా వుంది.

ఇంతలో ఆటో ఆగిపోయింది.

తామెక్కిన ఆటోయే కాదు. చాలా వాహనాలు నిలబడిపోయాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది.

యాక్సిడెంటు జరిగింది.

ఎవరో పదేళ్ళ అబ్బాయిని లారీ తొక్కుకుపోయింది మనిషి తుక్కు-తుక్కయిపోయాడు. రక్తం మాత్రం చాలా దూరం వరకు తుళ్ళింది. ఆబండి డ్రైవర్ని కొడుతున్నారు.

అప్పుడే పోలీసులొచ్చారు. అంతా నిశ్శబ్దమయింది. పోలీసులు కొలతలు తీసుకుంటున్నారు.

స్తంభించిపోయిన ట్రాఫిక్ వెనకాల నుండి వాహనాల హారన్‌ల మోత, ఒకటే అరుపు...

గోదారమ్మకు దూరంగా దృశ్యం కనపడుతోంది.

జనాన్ని పోలీసులు చెదరగొడుతున్నారు.

''సినిమాకి టైమయిపోతోంది.... టిక్కెట్లు అయిపోతాయేమో..'' కేశవుడు గింజులాడిపోతున్నాడు. ఆటో వాడు దొరికిన సందులోంచి వీలున్నంత ముందుకు వచ్చేస్తున్నాడు.

లారీని రోడ్డు పక్కను పెట్టించారు.

శవాన్ని కూడా చాపలో వేసి పక్కకు లాగి గుడ్డ కప్పారు.

ట్రాఫిక్ కదిలింది.

ఆటో కూడా. ఆటోలోంచి గోదారి చూపులు రక్తపు మడుగు మీదకు ప్రసరించేయి. కళ్ళు తిరిగినట్టయింది. మనసంతా ఆ దృశ్యం కలచి వేస్తోంది.

''టికట్లు దొరుకుతాయంటారా...?'' కోడలి అనుమానం.

''... ఏమో... ఆటోపోనియ్...వేగం...'' కేశవుడి ఆత్రుత.

సినిమాహాలు ముందు ఆటో ఆగింది. ఆటోవాలాకు డబ్బులిచ్చి టిక్కెట్టు బుకింగు దగ్గరకు వెళ్ళకముందే ''హౌస్‌ఫుల్'' బోర్డు.

కేశవ చాలా నిరుత్సాహ పడిపోయాడు.

'రాకరాక వస్తే హుం..' బాధపడిపోయింది కోడలు. 'నాన్నా'... పిల్లలు అనుమానంగా ఏదో అడగబోయేరు.

' ఐదు పది...' మాట విన్నాడు.

బ్లాకులో కొనేసి మరీ అమ్మినవాళ్ళే, హాలు వాణ్ణి మనుసులోనే తిట్టుకొని జేబులు ఖాళీ చేసుకుని హాలులోకి దారితీసాడు కేశవ. అతని వెనకాలే పిల్లల్ని పట్టుకొని, గోదారిచెయ్యి పట్టుకొని కోడలు నడిచింది.

సీట్లలో కూలబడ్డారు.

అప్పటికే సినిమా నడుస్తూ వుంది.

'' ఎంతసేపయింది బిగినయి...'' కేశవుడి ప్రశ్న.

''అరగంట...'' ప్రక్కసీటు.

''పోనీలెండి...''శాంత పరచింది. కేశవుడ్ని అతని భార్య

గోదారికి కళ్ళముందు సినిమా రీళ్ళు కనబడటంలేదు. ఇందాకటి శవమే సుళ్ళు తిరుగుతోంది. రక్తం మడుగు పారుతూ వచ్చి కాళ్ళకు తాకినట్లయింది. నిజంగానే తడిగా తగిలింది కాళ్ళకు. గతుక్కుమంది. తడిమి చూసుకుంది... ఎల్లాగానే వుంది... గుండె వేగంగా కొట్టుకుంది...

''కిల్లీ నమిలి ఊసేసినట్టున్నారు...'' కోడలు గోదారమ్మ వేపు చూసి చెప్పింది. మళ్ళీ సినిమాలో పడింది.

చాలా సేపటికి గాని సినిమాలోకి వెళ్ళలేక పోయింది గోదారి.

తలలు పగుల కొట్టుకోవడాలు.. చెరచడాలు... మధ్య మధ్యలో అమ్మోరు పట్టినట్టు గెంతడాలు...విసుగేసింది గోదారికి. అర్ధనగ్నంగా వుండే ఆడాళ్ళని చూస్తే చిరాకొచ్చింది. ''ఇదేం పోయేకాలం... సిర పక్కన సుట్టుకొని కొప్పున పూలెట్టుకొని భుజా ల నిండుగా పైట కప్పుకుంటె ఎంత ఒబ్బిడి.... ఎంత అందంగున్ను...' అనుకుంది. ఆగడాలు చెలాయిస్తున్న విలన్‌ని చూసి ఉక్రోషంతో పైకే తిట్టింది గోదారి.

కేశవుడు చిరాకు పడ్డాడు.

సినిమా అయిపోయింది.

ఇళ్లు చేరుకొని భోజనాలయాక సినిమా గురించే చర్చిస్తున్నారు కొడుకూ, కోడలూ. పిల్లలు ఫైటింగులు గురించి మాట్లాడుకుంటున్నారు.

గోదారి మాత్రం మౌనంగా వుండిపోయింది.

ఆరాత్రి నిద్దట్లో పిల్లాడే మెదిలాడు. శవం కదులుతూ లేచి నిలబడినట్లయింది.

వాడి తల్లి ఏడుపును ఆపి రొమ్ముకు అదుముకున్నట్లయింది.

ఊహలోంచి ఇవతల పడింది...

ఆ పిల్లాడి కోసం ఇంట్లో ఎంతగా ఎదురు చూస్తుంటారో... అయ్యరాలేదని? 'ఇంకేమయ్య.. అంతా సరి...' ఏడ్చుకుంది గోదారి.

రాత్రంతా రంపపు కోతలానే గడచింది గోదారికి. తెల్లవారింది. అన్నీ మామూలే. అంతా వెళ్ళిపోయారు. కోడలూ తనే మిగిలింది.

కోడలు వంట చేస్తుంటే నేస్తరాలి దగ్గరికి వెళ్ళాలనుకుంది గోదారి.

ఇంతలో కోడలు కడుపు నొప్పిగా వుందని చెప్పింది. కంగారు పడుతూనే ఉప్పునీరు కలిపిచ్చింది గోదారి. లాభం లేకపోయింది.

వంట గదిలోకి వెళ్ళి పోపుల సామానంతా వెతికి మరీ పట్టుకొచ్చి కోడలి నోటిలో వాము వేసి 'కసిబిసీ నమిలెయ్యమ్మా...' చెప్పింది గోదారి. కోడలు అలానే చేసింది. ఫలితం లేకపోయింది.

పళ్ళు కరచుకొని కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ నులుసుకు పోవడంతో గోదారికి చమటలు పట్టేసాయి. కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. గొంతు పిడచగట్టుకుపోయి వంట్లో చిన్నగా వణుకు ప్రారంభమయింది.

'' ఏటి సెయ్యాల్లో దేవుడో...'' గొంతులో దుఃఖం ఉబుకుతోంది. కనుకొలకుల్లో నీళ్ళు చేరుతున్నాయి.

గోదారి వీధి వరకు నడిచింది. మళ్ళీ అరుగుమీదకు వచ్చి ఇంట్లోకి నడచి వీధిలోకి వచ్చి... ఇలా కాలు కాలిన పిల్లిలా తిరుగుతోంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు... '' ఇరుగు... పొరుగూ ఎవ్వరూ రారే.. ఇదేం ముష్టి మనుషులు.. ఈల నాగరీకం బుగ్గయిపోను... పిలిస్తే వస్తారా... ఏమో... రాకపోతే...అమ్మో...'' స్వగతంగా అనుకున్నా మాటలు పెదవుల్లోంచే పెల్లుకుబుతున్నాయి.

కోడలి దగ్గరకు వెళ్ళింది... ''అమ్మా... మా నేస్తం వాళ్ళింటికెళ్తా... ఆల్ని పిలుస్తా...'' చెప్పి పరుగు తీసింది గోదారి.

ఆత్రంగా చెప్పింది విని... ''అయ్యో... మా ఇంట్లో కూడా మగమనుషులు లేరాయె. ఎలాగ... మా అబ్బాయిని పంపిస్తా...'' అంటూ నేస్తం కూతురు తన కొడుకును పిలిచింది. విషయం చెప్పి ''రిక్షానో.. ఆటోనో... పిలుచుకు రారా. మీరెళ్ళండమ్మా... వాడు మీ ఇంటికే తీసుకొస్తాడు...'' అని చెప్పిందావిడ.

కృతజ్ఞతా పూర్వకంగా చూసి మనసులోనే నమస్కారమిడి గోదారి ఇంటికి పరుగు తీసింది. కోడలుకు విసురుతూ ఉపచర్యలు చేస్తూ ఆపసోపాలు పడింది. ఈలోగా

రిక్షా రావడంతో ఇంటికి తాళం వేసి కోడల్ని రిక్షాలో నిడుకొని హాస్పిటల్కకి తీసుకువెళ్ళింది.

డాక్టరు ముందు చేంతాడులా 'క్యూ' వున్నా అర్జెంటు కేసని చూసాడు. ఇంజక్షన్లు రెండిచ్చి, టాబిలెట్లు రాసిచ్చాడు. గంటలో ఇంటికి చేరుకున్నారు. కోడలికి బాగుండడంతో సంతోషపడి రిక్షా తెచ్చినబ్బాయికి మిఠాయిలిచ్చి, వంగి వాడి బుర్రమీద ముద్దు పెట్టుకుంది. వాడి చూపులో కూడా ఆప్యాయత వుంది.

''బడికి వెళ్ళలేదా...'' గోదారే అడిగింది.

'లేదు' అన్నట్లుగా తలూపాడు వాడు.

''నీ పేరమ్మ...'' మళ్ళీ ప్రశ్నించింది గోదారి.

గుడ్లు మిటకరిస్తూ చూసాడే కాని జవాబు చెప్పలేదు. అంతలోనే వీధిలోకి పారిపోయాడు వాడు.

తరువాత కోడలి ద్వారా వాడు మూగాడని తెలిసి ఎంతో బాధపడింది గోదారి. అంతకన్నా ఎక్కువే దేముడ్ని తిట్టిపోసింది.

కోడలి బలవంతం మీద ఒక ముద్ద తిన్నాననిపించుకుంది గోదారి.

సాయంత్రానికి కేశవ, పిల్లలు వారి వెనుకే తిప్పడు వచ్చాడు.

'' ఔన్ర.. తిప్పా... నీవెప్పుడొచ్చేనావురాపట్నం, బాగున్నావా...'' అని పలకరిస్తూనే, కోడలికి బాగోలేకపోవడం అంతా కేశవుడితో చెప్పింది.

కేశవుడుభార్య పడుకున్న మంచం దగ్గరకు వెళ్ళి ఆమె తల నిమిరి విషయం తెలుసుకున్నాడు. పిల్లలు ఆదుర్దాగా మంచమెక్కి తల్లి పక్కలో కూర్చున్నారు.

''ఫరవాలేదులేరా, డాకటేరు ఇంజీసనిచ్చినాడు... ఇంద మందుల సీటి. మందు లొట్టికిరా..'' గోదారి మాటతో కేశవుడు చీటీ పట్టుకొని బయటకు నడిచాడు.

''తిప్పా... కూకోర... నిలబడిపోనావు...అవున్నీకిల్లు ఎలాగ తెలిసిందిరా...'' అడిగింది గోదారి.

'' ఏముందే అప్పా, మా అయ్యకున్న రెండెకరాలు మా నాలుగున్నరన్నదమ్ములం సర్దుకుంతే అరెకరా ఏసి వచ్చింది. ఆటిమీదేటి బియ్యం పొంగుతాయి? ఎప్పుడూ గోసికి కురసే బతుకయిపోయిందని కూలికెళ్ళాలన్నా మనుర్లో ఏటి డబ్బులొస్తాయని ఈ పట్నం వచ్చి మేస్త్రీ కాడ కూడినా. సున్నం... సిమ్మెంటు పడక సేతులూ కాళ్ళూ సిల్లులు బడిపోనాయి. ఇంకే పని దొరకాలేదు. ఆపని పూరా వుండదు.. బజార్ల మీ కేశవగుపడితే ఎంట పారొచ్చినా...'' చెప్పాడు తిప్పడు.

'' ఏమి పట్నంరా. హు...కంత గంజినీరు తాక్కొని డొక్కలకాలెట్టుకొని వుంతె సుబ్రం.... సుకం... ఇక్కడ మనుషులేరి..? అక్కడిలాగ ఒకడి కష్టం... ఒకడికొద్దు...

ఒకడి సాయం మరొకడికి లేదు. ఆ పూటకి లేకపోయినా....సెయ్యి సాయము అదవాలేకపోయినా మాట సాయముంతాది మనూరుళ్ళంట. అది సేనర మనసుగూటం పడ్డాకి...'' నిరుత్సాహంగా.... నిస్తేజంగా అంది గోదారి.

ఇంతలో కేశవుడొచ్చి ఇంట్లో టాబిలెట్లు ఇచ్చి ''తిప్పా, మరేటి విషయం? పని అంత వేగం దొరకదు. దొరికితే కబురెడతాను...'' అన్నాడు.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత-

''మరి పని సూడకండయ్యా... నాను మనూరే ఏకంగా ఎలిపోతాను. ఈపాటి బతుకు అక్కడా బతగ్గలను. ఇక్కడ సస్తూ బతకడం కంతే అక్కడ బలికి సావడం మేలు. తోవ మార్సుకున్నాను...''

''అది కాదురా...'' ఏదో చెప్పబోయాడు కేశవ.

''పిల్లలూ... పెళ్ళం... అందర్నొదిలి ఏట్రట నీకిగతి తిప్పా...పోనేటి నాలుగు పైసలు సంపాదిస్తన్నావా... ఇంటికి పంపడానికి... మరేల అలాటప్పుడు నీ ఇష్టపెకారం ఇంటికి పో...'' గోదారి తీర్పు ఇచ్చేసింది.

తిప్పడు వెళ్లిపోతానంటె - ఆరాత్రి కడుపునిండా భోజనం పెట్టి పదిరూపాయలు కొడుకు దగ్గర తీసుకొని ఇచ్చింది గోదారి. తిప్పడు గోదారికి, కేశవుడికి నమస్కారం పెట్టి ''మీ ఋణం తీర్సుకోలేనిది'' అంటూ వెళ్ళిపోయాడు.

రెండ్రోజులు గడిచాయి.

కోడలు పూర్తిగా కోలుకుంది.

ఆరోజు పండగరోజు...

'ఇంట్లో పిండివంటలు తప్పితే సందడి లేదు. అక్కడ వూర్లో లాగ సంబరాలు లేవు. సరదా లేదు. అక్కడ ఊరెంత వుప్పొంగి పోతుంటుందో...'' తను పండుగకు అక్కడ లేక పోయినందులకు ఎంతో బాధపడిపోయింది గోదారి. రెక్కలుంటే మాత్రం వెళ్ళి వాలిపోయేదే...

కొడుకు కూడా అడిగాడు ''ఏవమ్మా... అలావున్నావ్...''. వాడికి చెప్పినా అర్థంకాదు.. చెప్పు కోలేదు.

ఇంతలో గోదారి గుండెకు గండి పడ్డట్టు వార్త!

గోదారి నేస్తరాలు చచ్చిపోయింది. గోదారి ఏడుస్తూ పరుగు తీసింది. శవం మీద పడి భోరున ఏడ్చింది. సొంతమయిన వాళ్లెవరూ ఏడవడం లేదు. ''ఎలానూ ముసలైపోయింది. వయసుడిగి పోయింది. ఆమె భర్త కూడా ఎప్పుడో చనిపోయేడు. పోయినా ఈ లోకాన్ని వీడి ముక్తురాలైనందుకు సంతోషించాలే గాని... బాధెందుకు...

ఆమె బాధ లీడేరిపోయాయి'' అనే భావనే అందర్లోనూ.

గోదారి ఒక్కర్తే పిచ్చిది. మానవ సంబంధాలు శాశ్వతం కావాలనుకొనే వెర్రిబాగులది. తెలివితక్కువది. చావు పుటకలు సహజమని తెలియదేమో! నిబ్బరమో రాతి గుండెలదో ఆ వాక్కు.

స్నాన మాడించి శవాన్ని కాటికి మోసుకు పోతుంటే చాలా వరకూ వెంట పడ్డ గోదార్ని వెనక్కు తీసుకువచ్చారు. నేస్తరాలి మనవడు గోదార్ని చూసి మరీ వెక్కివెక్కి ఏడ్చాడు.

నేస్తురాల్ని బుగ్గి చేసేసారు.

కేశవుడి గోదారిని ఇంటికి తీసుకుపోయాడు.

'' ఎవర్తో చస్తే.. వెర్రిముండలా నీ ఏడుపేంటే... సిగ్గూ ఎగ్గూ లేకుండా వీధిల పడి...' కొడుకు ప్రశ్న గోదారి శరీరాన్ని ముక్కముక్కలుగా కోసి కారం అద్దింది. సమాధాన మీయలేదు. తినమంటే తినలేదు. అలా అని కొడుకుమీద కోపం లేదు. అసలు పట్నం పైత్యం మీదే ఆవిడ రోషమూ, ఆవేశమూ, బాధా... అన్నీను..

ఇంట్లో అందరూ ఫోం చేస్తున్నారు. మనుమలు పిలిచి లాభం లేక ఊరుకున్నారు. కోడలు చెప్పినా ప్రయోజనం లేదు.

గోదారి ఒంటరిగా కూర్చుంది. ఆలోచిస్తోంది. మనుషుల మనసులేకమయిపోయాయి. చావు బ్రతుకుల్లో వున్నా... చచ్చినా... అనవసరం. ఎవడి బ్రతుకు వాడు బ్రతకడమే అవసరం!

'మనిషిపోతే తనూర్లో ఐతే ఊరు తిరగబడేది... దుఃఖంతో నిండిపోయేది. బుగ్గి చేసిందాక బువ్వ ముట్టరు. పురమెత్తడం... ఏట్లో కలపడం... చివరిగా మనిషిపోతే వీడ్కోలివ్వడం కళ్ళముందు కదలాడింది... ఆజనం వేరు... ఆబతుకులు వేరు.. ప్రేమలు.. అనురాగాలు.. అప్యాయతలూ... వేరు ... వాళ్ళ మధ్య రెండునాళ్ళు గడిపినా చాలు... ఈ మానవ రాక్షసుల మధ్య బతకాలంటే బండలాంటి గుండె కావాలి. అది తనకు లేదు. తను ఇమడలేదు. ఇంకిపోలేదు....

అందుకే అమృతాన్ని పంచే ఆత్మీయుల దగ్గరికి వెళ్ళిపోవాలి. కన్నీళ్లను పంచుకొనే కన్నవారి దగ్గరికి... కన్న భూమి దగ్గరికి... పుట్టిన మట్టి మీద గిట్టిపోడానికి వెళ్లిపోవాలి.

'నేను నా ఊరెళ్ళిపోవాలి' అనుకుంది. గోదారి.

అనుకున్నదే తడవు మనసు పట్నం దాటుకొని పల్లె పొలిమేర్లలోకి వెళ్లిపోయింది.

రచనా కాలం: సెప్టెంబర్ 1990,

మే: 1992 రచన సచిత్ర మాస పత్రిక ( ఉగాది ప్రత్యేక సంచిక)